# తెలిసి చేసే తప్పు

ఏడాది కుర్రవాడిని ఎత్తుకుని విమల ముద్దు లాడుతూంది :-

''మా వాడు డాక్టర్ చదువుతాడు! లాయర్ చదువుతాడు! జడ్జీ అవుతాడు! ప్రొఫెసర్ అవుతాడు! లండను వెళతాడు! - అప్పుడు పాతిక వేల రూపాయలు కట్నం యిస్తేగాని పెళ్ళి చెయ్యం' ! ఏమనుకున్నారు?'' అంటూ మురిసిపోతూంది.

ఆమె భర్త శేఖరం ఏమీ మాటాడలేదు.

''ఏమంటావు శేఖరం - మీ ఆవిడ అలా అంటోంది ?'' అని అడిగేను -

''ఉత్తినే అలా అంటోంది గాని యీ కాలంలో గూడా కట్నాలు తీసుకోడం ఏమిట్రా ?''

''ఏం ? ఎందుకు తీసుకోకూడదు ? మీరు తీసుకోవచ్చా ? మా వాడు తీసుకోకూడదా ?'' వెంటనే విమల అడిగింది.

''అవును! అదీ నిజమే మరి!'' అని నేనన్నాను.

ఈ మాట విని శేఖరం అదోలా బాధ పడిపోయేడు.

''అవును. నే తప్పు జేసేను... కాని నాకు అప్పటికి ఏమీ తెలీదు... ఎలాగయినా కట్నం తీసుకోవడం తప్పే... నాకు పెళ్ళయే వేళకి ఆ విచక్షణా జ్ఞానం లేదు. అంత ఆలోచనాశక్తి, స్వతంత్రం లేవు. అప్పటికి నామాట, ఆ వయస్సులో ఎలా చెల్లుతుంది ? లక్ష్య పెట్టేవాళ్ళెవ్వరు ? ఎటువంటి ఆదర్శాలు వున్నా అటువంటి పరిస్థితుల్లో నెగ్గడం చాలా కష్టం - చిన్నతనంలో సరదాలు తీరుతాయని ఒప్పేసుకున్నాను. కాని అవతల పెద్దవాళ్ల మతలబులు తెలుసుకోలేకపోయేను. - కట్నం తీసుకోడం నాకిష్టం లేదు - ఇప్పుడా మాట, నిబ్బరంగా, ధైర్యంగా పైకి అనలేను! - అన్నానంటే - నువ్వెందుకు తీసుకున్నావని దెప్పుతారు - నేను తప్పుచేశాను కనుక అది సమర్థించుకుందుకని ''తీసుకోండి కట్నాలు'' అని మనస్ఫూర్తిగా అనలేను!... నా పరిస్థితి యిలా వుంది. ఏం చెయ్యమంటావు ?.... యీ విమల కూడా మాటి మాటికీ యిలాగే దెప్పుతూ వుంటుంది గాని నా అభిప్రాయాలు ఏ పరిస్థితులవల్ల మారిపోయినాయో యిందులో పొరపాటు ఎవరిదో - ఎవరికి కావాలి ?'' అని శేఖరం వుద్రేకంతో అన్నాడు.

అలా అనగానే అతని ఆదర్శాలేమిటో --- ఎలాటి పరిస్థితుల వల్ల ఆచరించలేకపోయాడో వినాలని నాకూ కుతూహలం కలిగింది.

''అయితే అదేమిటో విపులంగా చెప్పవోయ్ వింటా!'' నన్నాను.

''ఎందుకు లేదూ ! ఎవరు నమ్ముతారు ? వుత్తి కాకిగోలే గాని !''

''అలా కాదు చెప్పు ! -''

'' అయితే .... అదుగో ఆ విమలని మధ్య మధ్య అడ్డుపడకుండా కాయాలి ! లేకపోతే నా తరం గాదు !'' అన్నాడు . అది విని -

''అయ్యో నాకేం ! ఎంచక్కా చెప్పుకోండి ! ప్రజ్ఞ ! నువ్వే వాళ్లు లేకపోతే సరి... నేనూ వింటాను!'' అంది విమల.

''మధ్యని అడ్డు ప్రశ్నలు వెయ్యొద్దు !''

''అలాగే''

అన్న తర్వాత శేఖరం మొదలెట్టేడు ; -

''నా చిన్నతనంలో - నేనెక్కడికి వెళితే అక్కడ పెళ్లిమాటలే! అందుకే బంధువుల యిళ్లకి వెళ్లడం అంటే అదేమిటో సిగ్గుగానూ, మరేమిటో సరదాగానూ కూడ వుండేది. నేను యింకా చిన్న క్లాసులు చదువుకుంటూండగానే... మా బంధువులందిరికీ వారి కుమార్తెలకు నేనే కనిపించేవాడిని. అప్పటినుంచే పెళ్లిమాట లాడడం జరిగేది. అందరికళ్ళూ నా మీదే కేంద్రీకరించి వుండడం వల్ల సెలవులు యిచ్చినప్పుడల్లా ఏదో ఒక మిష మీద ఎవరో ఒకరు వంతుల చొప్పున వాళ్ళ యిళ్ళకి తీసుకు వెడుతూ వుండేవారు. నేను వారికి అల్లుణ్ణి అయినా, అవకపోయినా, నా ఛాన్సు బా వుండేది. అల్లుని మర్యాదలతో వెళ్ళి తిరిగి వచ్చేవాడిని. - క్రొత్త క్రొత్త బట్టలతోనీ, వ్రేలి వుంగరాలతోనీ, ఇల కుబేరుడిలా ఇంటికి వచ్చేవాడిని.

ఇందరికీ నా యీడుకి జోడు అయిన అమ్మాయిలు వుండడం, నా అదృష్టం - అటువంటి తిథి, వార, వత్సర, నక్షత్రాల్లో పుట్టడం సామాన్యమా ? - 'గాంధీగారు బ్రతికిన కాలంలో వుండి ఆయన్ని స్వయంగా చూశాను' అని చెప్పుకోడం కొందరికి గొప్ప. మరి కొందరికి - 'ఒకటో ప్రపంచ యుద్ధం చూశాను' అని చెప్పుకుంటేగొప్ప - ఇలా ప్రతివారికి వాళ్ళ వాళ్ళ కాలంలో ఫలానా గొప్ప విషయం జరిగింది అని చెప్పుకోడం గొప్ప - అలాగే నాకేమిటి గొప్పంటే -

నేను పుట్టిన తర్వాతే మా బంధువుల్లో అందరికీ ఆడపిల్లలు పుట్టడం, వాళ్లందరూ యించుమించు ఒకే వయస్సు గలవారయి వుండడం, అటువంటి సమయంలోనే నేను వారందరికి, యీడుజోడుల్లోనూ, అంద చందాల్లోనూ, ఒడ్డు పొడుగుల్లోనూ, అన్నిట్లోనూ, సరిపడ్డవాడుగా కనపడ్డం, జరిగినా జరగకపోయినా, ఎక్కడ కెళితే అక్కడ 'ఇదిగో వీడే దీని మొగుడు ' అని అనిపించుకొనడం నాకు గొప్ప-'

''ఓహోహో ! ఏం వర్ణించేరండి ! ఏం గొప్పలు ! ఆడవాళ్లందరూ మీకోసమే నోములు నోచి పుట్టినట్టుంది ! మీరే గాని మరెవరూ మొగాళ్లు లేనట్టుంది ఆహా ! '' అంటూ మధ్యలో విమల ఎగతాళి చేస్తూ నవ్వింది !

''చూశావోయ్ - అందికేనే చెప్తున్నాను - నా కోసం ఎంతమంది ఎగబడ్డారో ? ఎంత మంది పోటీలు పడ్డారో దీనికేం తెలుసు ? ... దానికూడా కారణం వుంది. చెబుతా. విను - '' అన్నాడు.

''ఆడపిల్లలికి పెళ్లి చేసేముందు, తల్లి దండ్రుల దృష్టి, ఎన్నో అన్వేషిస్తూ వుంటాయి. బహుశా నా వరాన్ని యివి అయి వుండొచ్చు...

పుట్టగానే తండ్రికి వక్రించిన వాడినవడం చేతనూ, ఒక వేళ పెళ్ళాం కాపరానికి వచ్చే వరకూ ఉద్యోగం దొరక్కపోతే, యజమానిని నేనే కాబట్టి పిక్క చేతిలోనే వుంటుంది కనుక తమ కూతురి ముద్దు ముచ్చట్లకి, మూతి ముడుపులకి కించెత్తూ లోపం జరగదనిన్నీ - భర్త పోవడంచేత మా అమ్మ మరి ఎవరితోనూ ఏకమవడానికి అవకాశం లేక కూతుర్ని బాధ పెట్టలేదు కదా అనీన్ని, కూతురు అల్లుడూ ఏకమయితే ఒంటిదయిన అత్తగారి ఆటలు సాగక కోడలెలా చెబితే అలా వూరుకుంటుంది అనీన్ని, అప్పుడు తమ కూతురు మహారాణీ అయి గృహ సామ్రాజ్యాన్ని ... సర్వాధికారాలతో అనుభవించి ఏలవచ్చుననీన్ని, - లింటికి తండ్రి ఆస్తి, పుష్కలంగా వుండడం వల్లనూ, ఇరస్తా వరస్తా ఎవ్వరూ లేక ఏక చక్రంలాగ ఎటు చూసినా వారసప్పురుగు అన్నది లేకుండా ఒక్కడినే వుండడం వల్లనూ, ఆస్తి పాస్తి యిత్యాది సర్వ విషయాల్లోనూ చిక్కులుగాని, అనుమానాలు గాని యిబ్బందులుగాని కించెత్తూ లేకపోవడం వల్లనూ -

ఒకవేళ ఆడ బొడుచులు వుంటే తమ కూతుళ్లకి అచ్చులు వేసి ఆట కట్టేస్తారేమో అని అనుకుందికి... పెళ్ళిలో మంగళ హారతి పళ్లెం పట్టడానికయినా ఎవరూ లేకపోవడం వల్లనూ, తద్వారా ఆడబొట్టి లాంఛనాలు మిగులుట వల్లనూ, చిన్నతనంనుండి పెద్ద క్లాసులు చదవడం వల్లనూ, యింకా ఎన్నో యిలాటి చిల్లర మల్లర విషయాల్లోనూ, ఎన్నికగాడినయి, మన్నికగాడి నయినాను.

అసలు నాకు, - నాకేమిటి... ఎవళ్ళకయినా - సరిపడి, పనికొచ్చే ఆడపిల్లలు ( కూతుళ్లు) లేని మేనమామలుంటే - చెడ్డకోపం వస్తుంది...రాదూ ? మేనల్లుడు వున్నాడు అంటే - మేనమామ డ్యూటీ కూతుర్ని కని వాడికోసం రిజర్వు చెయ్యడమే... అది విధి ! అలా లేనపుడు వాళ్ల మొహం కూడా చూడకూడదు!

అయితే గుడ్డిలో మెల్ల అన్నట్టు ఒక మేనమామ పరువు నిలబెట్టేడు. నేనెందుకు తన చెల్లెలికి ఉద్భవించేనో గ్రహించి అందుకున్నాడు. ఇంక అడిగారా ? - ఎలాగూ వీడికది తప్పదంటే దానికి వీడు తప్పడూ - ఓహోహో ! ఇహీహీ .... ! అని అందరూ అనుకున్నారు. అయితే మా అత్త మాత్రం అదోలా వుండేది. మామయ్య జంధ్యాలు తెంపుకొంటే, అత్త నూతికి పరుగెట్టి... తిరిగి వచ్చేసేది. అత్తకీ మామకీ మధ్య ఆ గోల యేదో నాకు తెలీదు. ఎంచేతంటే నేనపుడు ఏమీ ఎరగని చిన్నవాడిని. నాకు తెలిసిందల్లా, నేనూ, మా మరదలూ, గోడలుగెంతడం, వంతులాట లాడడం, - అందరూ మీరు 'మొగుడూ పెళ్ళాం' అంటే సిగ్గుపడిపోవడం. - అంతే.

పాపం మా మరో మామయ్యని చూస్తే జాలివేస్తుంది. నన్నెలాగయినా అల్లుణ్ణి చేసుకోవాలని మహా తాపత్రయ పడేవాడు. ఎందరెందరో దేవుళ్లకు మొక్కుగాని ఆడపిల్ల పుట్టినప్పుడల్లా ''ఇదిగో దీన్నిచ్చి పెళ్ళి చేసేస్తా !'' అనే వాడు - అదేం ఖర్మమో లేక నా జాతక విపరీతమో గాని అల అన్న వెంటనే - ఆ పిల్ల కాస్తా ''వీడికా నన్నిచ్చి పెళ్ళి చెయ్యదల్చుకున్నావు ! అయ్యో ! నాన్నా ! నా కొద్దు బాబూ అంతకన్నా చావు నయం !'' అన్నట్టుగా చనిపోయేది ! మొదట్లో అది లెక్కచేయలేదుగాని

అదే అలవాటు అయిపోవడం బట్టి నాకో దండం పెట్టి విరమించుకున్నాడు... ఆ తర్వాత పుట్టిన యిద్దరూ పెళ్ళిళ్ళా వున్నారు! చూడండీ చిత్రం - ఇంతకీ ఆ యింటి అమ్మాయికీ నాకు ఘటన లేదే! యింక మిగిలిన యిద్దరి మేనమామల వూసూ అనవసరం. వేళకి యిచ్చుకోలేకపోయారు. ఆ తర్వాత ఎంత మంది లెక్క కొస్తేనేం?

వీళ్ళెవరూ అంటే యిహను మా దొడ్డమ్మల వంశాలు. ఓవ్వో! కుప్పలు! వాళ్ళ కూతుళ్ళ కూతుళ్ళందరూ నాకోసం పుట్టిన వాళ్లే. వాళ్లందరూ అక్కయ్య కూతుళ్ళు. అంటే పెళ్ళాం వంకవారినుండి మనకేది ముట్టినా, మన నుండి వారి కేది ముట్టినా మనలో మనం యిచ్చుగున్నట్టే - పైకి పోదు! అందుచేత యిచ్చి పుచ్చుకోడాలు పైకేగాని లోనంతా కలగాపులగమే! మేనమామ కూతుళ్ళ సంబంధాలయితే యింత బంక వుండదు.

మేనమామ కూతుళ్లయితే చిన్నపుడు ఆటపాటల్లో ఒసే అంటే ఒరే అనడానికి జంకుతారేమో గాని యీ అక్కయ్య కూతుళ్లు జంకరు. అంత చనువు. మొదటి నుండి అదేమిటో అక్కయ్య కూతురంటే అధికారం వస్తుంది! అలాగ్గానే అదీ చచ్చినట్టు మనం చెప్పినదల్లా చేస్తుంది. మంచి నీళ్ల తేవడం మొదలు, తిడితే పడడం వరకూ.

మేనమామ కూతుర్ని మొదటినుండీ ఏదయినా పని చెయ్యమంటే అసలు లెక్క చెయ్యదు. భర్త తల్లయాకూ తల్లిని 'అత్తగారూ' అని పిలుస్తుంది. మరి అక్కయ్య కూతురయితే ఒక్కొక్కపుడు 'అమ్మమ్మా!' అని యింకొక్కప్పుడు 'అత్తా' అని పిసుస్తుంది; అది ఆమెకు 'చోయిస్'.

మరదలులో గర్వం, జాణతనం, గొప్ప, అహంభావం, తక్కువచూపు, చురుకుదనం, కోపం, ఉడుకుమోతుదనం వుంటే, మేనకోడళ్లల్లో, వినయం, అమాయకత్వం, అణుకువ, అభిమానం, భయం, మర్యాద, సహనం, శాంతం, ఓర్పు, వుంటాయి.

మా పెద్ద దొడ్డమ్మ పెద్దరికంలో నాకు ఎవరిని యివ్వడమా అన్న ప్రశ్న వస్తుంది! ఓరి బాబు! ఎంత మంది ? పెద్దకూతురి హయాంలో నుండి ఆఖరి కూతురి చేతి కింద వరకూ పుంజీలు! పుంజీలు! పెళ్ళి కావలిసే ఆడపిల్లల లిస్టు! మా పెద్ద దొడ్డమ్మకి తన హయాంలో ఎవరిని యిచ్చినా అందరూ మనమరాళ్లే కాబట్టి పక్షపాతం లేదు. నాకు అంత కన్నా లేదు. అంచేత ప్రత్యేకంగా రికమండేషన్లు లాభంలేదు. అందువలన మా పెద్ద దొడ్డమ్మగారి హెడ్ క్వార్టరుకు నన్ను శెలవులకు రప్పించి, సింహాసనం మీద కూర్చోబెడితే - వంతు ప్రకారం ఒక్కొక్క అక్కయ్య వచ్చి, 'రావయ్యా అల్లుడుగారూ!' అని బాజా భజంత్రీలతో ఆహ్వానించి ఒకళ్ళకన్నా ఒకళ్ళు ముందుగా పందేలమీద మొదటి సీట్లు ఆక్రమించి ఉభయ ఖర్చులూ, లాంఛనాలూ, భరించుకొని తీసుకు వెడుతూండేవారు. ఒకరిచ్చింది మరొకరు రహస్యంగా కనుక్కొని తృణమో పణమో ఎక్కువ యిచ్చేం అనిపించుకుందికి చూసేవారు. యీ కాంపిటేషన్లవల్ల వండుకున్న వాడికన్నా దండుకున్న వాడే మేలు అన్నట్లు - ఇంటికి చిన్న పిల్ల జమీందారులా వచ్చేవాడిని. ఏనుగూ అంబారి ఒక్కటే తక్కువ!

తీసుకు వెళ్లింతర్వాత యీ అక్కయ్యత్తగార్ల గోల చెప్పనలవి గాదు. ...

ఒకటో అత్తగారు - తమ వూర్లో ''ఫలానా ఫలానా'' అని దండోరా వేయించేది.

రెండో అత్తగారు -

''ఇదిగో చూశారా వీడే మా అల్లుడు! మా ఫలానా అమ్మాయి మొగుడు! ఎలా వున్నాడు ?'' అని సాక్షులకోసం అన్నట్టుగా ప్రత్యక్షం చేసేది.

మరో అత్తగారు -

''మా అమ్మాయికి సరిగ్గా యీడూ, జోడూను! చిలకా గోరింకల్లా వుంటారు!' అని చెప్పి పొంగిపోయేది!

మరొకామె -

''బంగారంలాటి'' మా పిల్లలాటిది వాడికి మరొకర్తె ఎక్కడ దొరుకుతుంది! వాడికా అదృష్టం . వుంది కాబట్టి!'' అని చిన్న కళ్లలో పెద్ద చూపు చూద్దామనుకునేది.,

ఇలా బంధువుల్లో కావలసిన వాళ్ళందరూ, నా ఒక్కడికోసం వాళ్ళలో వాళ్లు పోటీలు పడుతుండగా యిహ పై సంబంధాల ప్రవాహ పరంపరలకి ఆనికే లేదు. నాకింకా యిరవయ్యో ఏడయినా జొరబడలేదు. యిహను అదొక్కటే తరువాయి అన్నట్టు యీ పిల్లల తల్లితండ్రులందరూ నా పెళ్లి మాటలకి మా ఇంటికి రావడం మొదలెట్టేరు.

నా బేరం వెయ్యిరూపాయిలనుండి ఆరంభమయింది. ! వచ్చిన పెద్దలందరూ అన్ని విషయాలూ పెద్ద వాళ్ళతోనే మాటాడినా నా దగ్గరికి వచ్చి పలకరించి పోతూ వుండేవారు. వాళ్లు ఎటువంటివారో గాని, సి. ఐ. డీల్లా - ఎక్కడ లేనివీ కనుక్కొని వచ్చేవారు. ముందుగానే మా యింటి విషయాలు మాకన్నా బాగా వాళ్ళే తెలుసుకు వచ్చేవారు ! ఎవరెవరు సమ్మంధాలకి వచ్చేరో ! నా వేలంపాట ఎంతలో వుందో - నా వంశం, కులం, గుణం, యివన్నీ ఎటువంటివో, యిలాటివన్నీ తెలుసుకొనే వచ్చేవారు.

అందులో ఒకరు -

''సంసారులం! ఏదో పెద్దగా సాగలేకపోయినా మా శక్తికొద్దీ, అంతటా ఆనవాయితీ ప్రకారం వెయ్యి నూటపదహార్లూ, వెండికంచం, చెంబూ, పట్టుతాపితాలూ, యిచ్చి తక్కిన లాంఛనాలు యథావిధిగా జరిపిస్తాం. డబ్బులో ఏముంది? వంశం, గుణం, వీటిల్లో వుంది గాని!, మా వంశం సంగతి వేరే చెప్పనక్కర్లేదు. ఒకమారు వచ్చి పిల్లని చూసుకోండి!'' అన్నారు.

''పదిహేనువందలు కట్నం యిస్తాం, వాచీ, సైకిలూ, అలకపాన్పుమీద పార్కరు పెన్నూ, పాతిక తులాల, దొంగవిల్లి వెండి గిన్నె యిచ్చి లాంఛనోపేతంగా వివాహం జరిపిస్తాం, సరే అంటే ఫలానానాడు ముహూర్తం యిద్దరి పేరా దివ్యంగా కుదిరింది!'' అని ముహూర్తం తేదీ కూడా రైటు చేసుకు వచ్చేడు ఒకాయన.

'కుర్రవాడి కిష్టమొచ్చినంతవరకూ మా యింటోనే వుంచుకొని చదువు చెప్పిస్తాం! ఆ తర్వాత వెతుక్కో అక్కర్లేకుండా వుద్యోగం వేయించే పూచీ మాది! పిల్ల ముత్యపు చిప్ప!'' అని చెప్పేడు మరొక మామగారు - ఇది యిల్లరికానికి ఒక్కటే మెట్టు తక్కువ!

మరొకాయన పిల్లను కూడా తీసుకు వచ్చి - ''తనకి ఆస్తి హద్దులు లేనంత వుంది అని, వారసులు

లేరని, ఒక్కర్తే ఆడపిల్ల అని, యిల్లరికం కావాలని'' చెప్పొచ్చేరు.

యింకొక ఆసామీ -

'' ఈ కాలంలో చదువుకున్న వాళ్ళనే పెళ్లాడాలిగాని చదువులేని వారిని పెళ్లాడకూడదని! అలా ప్రోత్సహిస్తే స్త్రీ విద్య అధికమవుతుందని - తన కుమార్తె మెట్రిక్యులేషను పాసు అయిందని'' - ఆమె- యిటువంటిదనీ అటు వంటిదనీ పొగడి, ఆమె తాలూకూ ఫొటో యిచ్చేడు.

ఇంకో ఆయన చాలా దూరం నుండి వచ్చి... ఏవేవో సంబంధాలు కలిపి, '' మా పెద్దవాడికి పుచ్చుగున్నట్టే మీవాడికీ యిస్తాం!'' అని సరిపోల్చి తైపారు వేశాడు.

ఇలా ఎంతోమంది ఎన్నో రకాలుగా, మూల మూలల నుండి దూర దూరాలనుండి పెళ్లి కొడుకుల కోసం భూతద్దాలతో రీసెర్చి చేసి వెతుక్కుని వెతుక్కుని వచ్చేవారు! యిదంత చూస్తే ఆడపిల్ల గలవాళ్లు ఎంత అవస్థ పడుతున్నారో? అనిపిస్తుండేది! మొత్తం మీద నా పాట మూడువేలతో ఫుల్‌స్టాప్ పెట్టబడింది. యింతవరకూ పెరగడం యీ పోటీల వల్లనేగదా- ఎందుకంత ఎగబాకడం ?

ఇలా జరుగుతూ వుండగా, మా యింట్లో కూడా చర్చలూ, ముచ్చటలూ, వాదనలూ, ఆలోచనలూ, మొదలైనాయి. నా వెల ఎక్కువవుతున్న కొద్దీ మా వాళ్లకి దగ్గిర బంధువుల మీద, పూర్వం మాటయిచ్చిన వాళ్ల మీద శ్రద్ధ సన్నగిల్లనారంభించింది. ఎవరు ఎక్కువ కట్నం యిస్తే వాళ్ళ పిల్లనే చేసుకోవడంలోకి దిగింది. మూడువేల మీద ముల్లు వంగినా ఆ బరువు విలువయింది కాదని వదులుకున్నారు.

నా కిదేం నచ్చలేదు - అసలు కట్నం పుచ్చుకో కూడదని నా వుద్దేశ్యం; కాని నేనేమన్నా చిన్నతనం అన్నారు. ఈ బాధ పడలేక చదువయితేనే గాని నే పెళ్లాడనని పట్టుపట్టేను. కాని - చదువుకీ పెళ్ళికీ ముడేమిటనీ, ఏ కాలంలో జరగవలసిందా కాలంలో జరిగితేనే ముచ్చట అనీ, ముసిలిదయిన మా అమ్మమ్మ యింకెన్నాళ్లో బ్రతకదనీ నా పెళ్లి కళ్ల జూసి, కళ్లు మూస్తానంటోంది అనీ, అడ్డు పెట్టడానికి వీల్లేదని ఎన్నెన్నో చెప్పి పెళ్లికి ఒప్పించేరు. నాకు స్వతంత్రం లేదు. దేనికీ ఎదురు చెప్పే తాహతు లేదు. ధైర్యం వున్నా మాట నెగ్గేవరకూ రాలేదు. ఏమన్నా చిన్నతనంకిందే లెఖ్ఖ! అంతలా ఆలోచించడానికి యీడూ లేదు! అదీ కాక - నాకు కూడా, అప్పుడప్పుడే, అమ్మాయిలవైపు చూడాలని, వాళ్లతో స్నేహం చెయ్యాలనీ, వాళ్ళతో మాట్లాడాలనీ, చిన్న చిన్న జ్ఞానం కలుగుతూందేమో! పెళ్లాం, ఆ ముచ్చటా, ఆమె మా యింటికి రావడం, నేను పండుగులకి వాళ్లింటికి వెడుతూండడం, ఎంతో ఆనందంగా గడుపవచ్చనీ, సరదాగా వుండేది... యింకా, సూటు బట్టలు లాగొచ్చు, సైకిలు, రిస్టువాచి, చిల్లర ఖర్చులకి, అడపా తడపా, డబ్బూ, యింకా యిలాటివెన్నో - చిన్నతనంలో అందరికీ సహజంగా వుండే కోర్కెలన్నీ తీరాలంటే అదే దారి. లేకపోతే అప్పట్లో నా కోర్కెలన్నీ ఎలా తీరులాయి? నా మాట మరెక్కడా చెల్లదు. కాని అల్లుడినవగానే మామగారి దగ్గర చెల్లుతాయి. అవి చిన్నతనం కోర్కెలని ఎవరయినా అన్నా అక్కడ చిల్లర ముడుపులకింద పోతాయి. అడగవలసినవాడు అల్లుడు. అడిగితే తీర్చేవాడు మామగారు. తప్పులేదు. ఈ సరదాలన్నీ ముఖ్యంగా తీరాలంటే - పెళ్ళి చేసుకోవడం కంటే వేరే వుపాయం లేదు. ఇలాటి ఆలోచనల ముందర కట్నం పుచ్చుకోడమా? మానడమా?

మంచిదా ? కాదా ? కట్నం అంటే అర్థం ఏమిటి? - యిన్ని ఆలోచనలు రావడానికి ఆలోచించడానికి, అవకాశం కలగలేదు. ఈ సరదాల కోసం పెళ్ళికి ఒప్పుగుంటేనే బావుండుననిపించింది.

ఈ విషయంలో నేనొక్కడినే కాదు ! చిన్నతనంలో కట్నాలు తీసుకొని పెళ్ళాడిన వాళ్ళలో చాలా మంది అప్పుడు తెలియక వూరుకొని ఆ తర్వాత నాలాగే విచారిస్తూ వుంటారని నా వుద్దేశ్యం - పైకి ఏమీ నోరెత్తలేరు. కొంచం ఆలోచిస్తే యీ తప్పు పెళ్లికొడుకులది కాదు !.... పెళ్లి చేసే పెద్దలది! - పెళ్ళి కొడుకు తల్లిదండ్రులది, విచక్షణా జ్ఞానం గలవాళ్లు, అనుభవం గలవాళ్లు పద్దనాలి ! పుచ్చుకోడం మానాలి!

ఉదాహరణకి చూడూ ! మా అమ్మని, ఆమె తల్లిదండ్రులు కట్నం యిచ్చే పెళ్ళి జేసేరు. అప్పుడు మా అమ్మకూడా బాధపడే వుంటుంది. యీ కట్నాలు ఇవ్వడం, పోవాలని, మంచిది కాదని ఎన్నో కుటుంబాలు దీని వల్ల గుల్ల అవుతున్నాయని, ఎంతో మంది ఆడపిల్లలు కట్నాలు యిచ్చుకొనే తాహతు లేక పెళ్లిళ్ళు కాక కన్యలు గానే వుండిపోతున్నారని ఆమె అనుకొనే వుంటుంది. కాని - నేను పుట్టగానే నాకు పెళ్ళి చేసే వేళకి కట్నం పుచ్చుగుంటేనే గాని పెళ్లి చేసింది కాదు ! తనలాటిదే తన కోడలు కాదూ ? తన తల్లిదండ్రులు బాధ పడినట్టే తన కోడలి తల్లిదండ్రులు యిబ్బంది పడరూ ? అత్తా ఒక యింటి కోడలే అన్నట్టు అలా అనుభవించిన కష్టం మరిచిపోయి తామే ఆ పొరపాట్లు తిరిగి చేస్తూంటే, యీ కట్నాలు పోవాలి ? పోవాలి అంటే ఎలాపోతాయి ? యిప్పుడే చూశావు - యీ విషల ఏమంది ? తన కొడుక్కి కట్నం తీసుగుంటేనే గాని పెళ్లి చెయ్యనంది -

ఆమె కట్నం యిచ్చి - నన్ను పెళ్లాడి ఎన్నాళ్లో కాలేదు. కట్నం యిచ్చేముందు ఆమె తల్లిదండ్రులు పడ్డ యిబ్బందులు, కష్టం, దుఃఖం, అంతా తనూ ఎరుగును, తనకి కూడా అప్పుడు నేను కట్నం తీసుగొని తనని పెళ్లాడడం యిష్టం లేదు. - అయినా - అదంతా యింతలోనే మరిచిపోయింది. తను పెళ్ళి పెద్ద కాబోయేసరికి - తనకూ ఆశ పుట్టింది !

ఇది తప్పుకాదూ ? ఇదా తను చెయ్యవలసినపని ? యిలా వంశపారంపర్యంగా కట్నం పుచ్చుకోడం జరుగుతూంటే యిది పోతుందా ? దీనికి ముఖ్యంగా ఆడవాళ్లే కారణం. వాళ్లకి వాళ్లే నష్టం కలుగజేసు కుంటున్నారు ! మీదు మిక్కిలి పై వాళ్లపై అతి చులకనగా నేరం మోపి మాటాడుతారు ! అదీ కాక, మొగవాడు - ఇష్టం వుండో, లేకో, బలవంతాన్నో ఎలాగో కట్నం ఎప్పుడూ పుచ్చుకుంటూనే వున్నాడు... అది వాడి నిరంకుశత్వమే అనండి.. డబ్బు చేదు కాదు - వాడు తండ్రి అయినా ఇచ్చేవాడుంటే పుచ్చుకుందామనే చూస్తాడు. అందులోనూ ఇస్తాం ఇస్తాంఅని వస్తూంటే, పుచ్చుకోక ఏం చేస్తాడు? మరో సంగతి. ఆడ పిల్లలుంటే - నే పుచ్చుకున్నాను కదా.. ఆడపిల్లకి ఇవ్వొద్దా.. అని ధర్మ బుద్ధితోనే ఇస్తే ఇవ్వొచ్చు. మరి అంత హక్కు ఆడదానికున్నపుడు, ఆమె బుద్ధి ఏమయింది ? ఆమె హృదయం ఏమయింది? ఆమె ఎందుకు అడ్డు పెట్టకూడదు ?

ఈ తల్లు లెవ్వరూ అడ్డుపెట్టరు. మీదు మిక్కిలి ప్రోత్సహిస్తున్నారు ! ఇందులో కష్టం ఆడవాళ్ళకే బాగా తెలుస్తుది. యింత అనుభవించినా తిరిగి తమ పిల్లలకి తామే కట్నాలు పుచ్చుకుంటూంటే యీ కట్నాల సమస్య ఎలా పోతుంది ? కాబట్టి ఆడవాళ్లతమతోటి స్త్రీలు బాగుపడాలంటే తమ

పిల్లలకి కట్నాలు పుచ్చుకోకుండా, ఇవ్వకుండా పెళ్ళిళ్లు చెయ్యాలి. మగవాడు పుచ్చుకుందామన్నా నయాన్నీ భయాన్నీ చెప్పి మాన్పించి పెళ్ళి పెద్దలనిపించుకోవాలి.

ఎక్కడయినా మొగపుట్టుక పుట్టినవాడున్నాడంటే చాలు వెతికి వెతికి వాడిమీద పడతారు. ఎవరెంత కట్నం పొడేరో తెలుసుకొని, ఆ సంబంధం ఎక్కడ తప్పి పోతుందో అని మరో కొంత ఎక్కువ ఇస్తాం అని, ఇంకా పైని ఏవో వస్తువులు పెడతాం అని, ఒకళ్ల మీద ఒకళ్ళు పోటీలు పడడం వల్ల అవతలవాడు-నా మగోత్రాలు రెండే మిగిలినవాడయినా వాడికెక్కడలేని తాహతూ, అంతస్తూ, గొప్ప, గర్వం, దర్జా అన్నీ వచ్చేస్తాయి. ఎవరెంత ఇస్తామన్నా ఇంకా 'ఉఁహూఁ' లోనే వుంటాడు. వుండడూ? ఎవరిది తప్పు? పుంజాలు తెంపుగొని, కొంప మునిగిపోయినట్టు, మొగపురుగులు కరువయినట్టూ, అంత ఆత్రుత, చూపుతూ వుంటే! అలా అంత వేగిరపడి ఏదో ఒదుల్చుగుంటే చాలన్నట్టుగా అయిపోడానికి ఆడపిల్ల ఎందుకంత చులకన అయిపోయింది? మరికొన్నాళ్ళు పుట్టింట్లో వుంటేనేం? వుండడానికి ఆమెకి హక్కులేదా? ఆమె వారిలో అంశ పంచుకొని పుట్టలేదా? అంత బరువు ఎందుకు? తల్లిదండ్రులకి ఆడపిల్లలయినా, మొగపిల్లలయినా ఒక్కలాటి ప్రేమే వుంటుంది అంటారు! నిజమే కాని ప్రస్తుతం జరుగుతున్న విషయాల బట్టి తల్లిదండ్రులు యీ ఆడపిల్లలిని కురుపుల్లా చూస్తున్నారు. ఎంత అసహ్యమయిన మందు అయినా సరే రాసి ఆ కాస్సేపూ ఇంద్రియాలు బిగించుకొని ఆ బాధ వదిలిపోతే చాలు అన్నట్టుగా - ఎవడో 'మగవాడు' అనిపించుకున్న వాడున్నట్టయితే చాలు, యితరత్రా లక్షణాలు - మర్యాదా, ఆస్తి, చదువు, ఆరోగ్యం, వయస్సు, గుణం, గౌరవం మొదలయినవి వున్నా లేకపోయినా, వాడికి ఏదో విధాన్ని అంటగట్టి - పిల్లని వాడితో అంపకం బెట్టి 'అమ్మ నాయనా పిల్ల కాపరానికి వెళిపోయింది సగం బరువు తీరింది' అని నిబ్బరపడుతున్నారని అనుకోడంలో పొరపాటు వుండదు. ఆ తర్వాత తమ కన్నకూతురే ఎంత బాధపడుతుందో అని ఆలోచించకుండా వున్నారు. ఇంత శత్రువుగా ఆడపిల్ల ఎందుకు మారిపోయిందో ఒకప్పుడు పిల్లగా అనుభవించిన తల్లికి, తండ్రికి, అక్కర్లేదు. అలాగని అందరూ యిలా చేస్తున్నారని కాదు - కొందరు.

ఆఖరికి మూడువేల రూపాయలకి ఒక సంబంధం నిశ్చయపరచి నా అంగీకారం కోసం మా అమ్మ అడగ వచ్చింది. నా సరదాలు తీరాలని ఎంతో కుతూహలంగా వున్నా అవి తీరాలంటే కట్నం పుచ్చుకోకుండా పెళ్ళి చేసుకుందికి మా అమ్మ ఒప్పుకోదని తెలిసినా కట్నం వద్దని అప్పటికీ పట్టుపట్టేను. ఇహను ఎన్ని ఆశీర్వచనాలు కావాలో అన్నీ ముట్టేయి.

కొందరు యీ కట్నాలు పుచ్చుకోడాన్ని సమర్థిస్తూ మహా విచిత్రంగా తప్పుకుందామని చూస్తారు. కొందరికి కట్నం తీసుకొనకపోతే చిన్నతనమట! గౌరవానికి, తాహతుకి, మర్యాదకి, తక్కువట! అందరూ నవ్వుతారట! -

మరి కొందర్ని అడిగితే - "ఆ మొగపిల్లలకి పుచ్చుగున్న కట్నంతో ఆడపిల్లల పెళ్లిళ్లు జేస్తున్నామయ్యా! మా ఆడపిల్లల్ని వుత్తినే పెళ్లాడే మహానుభావు లెవరూ లేరు! మాకేం మిగిలిపోలేదు? మేమేమీ అది వదేసుగొని మేడలు కట్టుగోలేదు" అని వాదిస్తారు. ఇలాగే మా అమ్మకూడా ఎన్నో కారణాలు చెప్పింది -

''కట్నం మనకేం మిగిలిపోతుందట్రా! వెర్రివాడా ? మరి నీ పెళ్ళికి ఖర్చవదూ ? ఆ కట్నం వస్తే బొటాబొటీగా సరిపోతుంది, ఇంకా చేతిది తగలకుండా వుండదు. కూడదంటే ఎక్కడనుండి డబ్బు తెస్తాం! నీ పెళ్ళి ఎలా అవుతుంది? ఆ కట్నంతోనే నీ పెళ్ళి అయిందనిపించాలి!'' అంది.

''ఇది బావుంది! నా పెళ్ళికి, మనకయే ఖర్చులు మనం పెట్టుకోకూడదూ ? మరి పెళ్ళి జరిగేది వాళ్లింటే కదా - అదే పెద్ద ఖర్చు, ఆ ఖర్చూ ఇటు మనకయే ఖర్చూ, యీ రెండూ వాళ్లొకళ్ళనే భరించమనడం ధర్మమా ? అదీ కాక మన ఖర్చులు వాళ్లకి రుద్దడం ఏమిటి ? ఇదేమన్నా బావుందా?'' అని అడిగేను.

''అది సరే - పోనీ , తగినట్టు పిల్లకి బంగారం మనం కొనిపెట్టాలా ? మరి ఆ డబ్బుతోనే కొనిపెట్టాలిగాని. ఇంకెక్కడ నుండి వస్తుంది ? మనకేం మిగిలిపోతుందా ? వాళ్లపిల్లకి బంగారం కిందే-తిరిగి ఇచ్చేస్తాం!'' అంది.

''ఇది మరీ బావుంది! వాళ్లపిల్ల - వాళ్ళ బంగారం! దీనికి అర్థం వుందా ? వెంటనే పిల్లని మన ఇంటికే పంపేస్తారు. ఆ బంగారం మన దగ్గరే వుంటుంది. మనదే. అది కావలిస్తే మనం అమ్ముకోవచ్చు. పిల్ల తండ్రి అమ్ముకోగలడా ? కాని మనమే అమ్మితే వాళ్ళేమీ అనలేరు! అలా ఎందరో చేసేరు, చేస్తున్నారు! బంగారం మనది కాబట్టి మన డబ్బుతోనే కొనిపెట్టాలి. వాళ్ళ దగ్గర ఏ రూపాయీన్నీ పుచ్చుకోకూడదు. అదీ కాక మనకిరాని సొమ్ము వాళ్ళకెక్కడ నుండి వస్తుంది ? అయినా - నువ్వు బంగారం పెట్టవద్దు. వాళ్ల దగ్గర కట్నం పుచ్చుకోవద్దు - అలా పెళ్ళి చెయ్యకూడదూ!'' అన్నాను.

''ఇహ నీతో వాదించలేం - చెబితే వినాలి బొత్తిగా చిన్నతనం అయితే ఎలాగు ? అందరూ నీపాటి తెలియకే పుచ్చుకుంటున్నారా ? తెలియకే యిస్తున్నారా ? అదొక ఆచారం. ఇలాటి విషయాల్లో నిన్నడగడం నాదే తప్పు. నువ్వూ వీటిల్లో జోక్యం కలుగజేసుకోకూడదు. ఆ మూడు ముళ్లూ కట్టడం వరకే నీ పని, తక్కినవన్నీ మేం జూసుకుంటాం! నువ్వు నోరుమూసుకు వూరుకో!'' అని కసిరి మరి వాదించలేక - నన్ను వంచి, మరేం మాటాడ్డానికి వీల్లేకుండా చేసి ఏదో ఒక సంబంధానికి ఒప్పుకోక తప్పకుండా చేసింది. కాని నేనా సంబంధం ఒప్పుకోలేదు.

పరిస్థితులన్నీ నా చేతిలోనుండి మించి పోతున్నాయి. ఇంక మిగిలింది యిష్టమయిన పిల్లని ఎంచుకోడం. అదీ జారిపోతే - అందుకే మరేమీ వాదించక వూరుకున్నాను.

అని చెబుతూ చెబుతూ శేఖరం మధ్యలో ఆపేసేడు.

ఇంకా వినాలన్న తొందరతో ''మిగతాది చెప్పు!'' అని నేనడిగేను.

అతను విమల వయిపు చూస్తూ....

''ఇహ చెప్పబోయేది యీమె వినకూడదు... ఆమె వుంటే చెప్పను.'' అన్నాడు నవ్వుతూ!

నేనేమీ అనలేక వూరుకున్నాను.

''పోనీ యీలోగా కాఫీ చెయ్యి. నే పూర్తి చేసేస్తా'' అని అతనే అన్నాడు.

అది విని, కోపం వచ్చి చట్టుక్కున లేచి ఆమె వెళ్ళి పోయింది. ''యిహ నువ్వు చెప్పు'' - అన్నాను.

''నేను విమలని చూసినపుడు చిన్నతనం లోనే అయినా నా మనస్సు ఆమె మనస్సుతో మాటాడింది.

ఆఖరికి విమలని తప్ప మరెవ్వరినీ పెళ్లాడనని చెప్పేశాను. మా అమ్మ కూడా మరేమీ అనకుండా ఒప్పుకుంది. లాంఛనాలతో సహా పెళ్లి జరిగిపోయింది.

''చూశావా! అంత ప్రేమించినదాన్ని కూడా కట్నం తీసుకోకుండా పెళ్లాడ లేకపోయేను..'' అన్నాడు శేఖరం. ఇంతలో లోపలనుండి

- విమల నవ్వుతూ రెండుకప్పులలో కాఫీ తెస్తూ

''- మీ కవిత్వం, మీ వర్ణన, ... వింటేమొహం తిరిగినట్టయింది....కొంచెం తేరుకున్నాను.... అంతే ? ... యిదిగో, విత్తగించండి'' అని నవ్వు ఆపుగొని చెబుతూ కాఫీ యిచ్చింది.

''ఎంత వెటకారంగా వుంది ? .... అందుకే చెప్పనన్నాను..'' అన్నాడు.

''పోనీ అయిపోయిందిగా కడతేర్చు కథ'' అన్నాను.

''నా పెళ్లయిపోయింతర్వాత

తక్కిన బంధువులందరికీ ఎక్కడలేని కోపాలూ వచ్చేయి.

మాటలు మానేసినవాళ్లు కొందరు -

'' మా పిల్లకేం మొగుడు దొరక్క పోతాడా'' అని కొందరు.

'ఈ కట్నం పోస్తే వీడికన్నా మంచివాడే దొరుకుతాడు ?' అని యింకొందరు.

'అబ్బే ఏదో చిన్నప్పుడు వూరికనే వచ్చేవాడు గాని మేం మొదట నుండి మా పిల్లని వాడికిద్దామనుకోలేదు' అని కొందరు.

'మా పిల్లకి యీడు కాదు'' అని కొందరూ.

' మా పిల్ల వాడిని నచ్చింది కాదు' అని కొందరు -

ఇలా తలోకరూ తలోకలా నచ్చ చెప్పుగొని, సమర్థించుగొని మనశ్శాంతిని పొందేరు.

ఇంత మంది తమ పిల్లలకోసం నన్ను బేరం ఆడడం మొదలెట్టేరు. నేనేం లక్షాధికారినా ! మహా పురుషుణ్ణా ! నా కోసం ఎందుకింత మంది పోటీలు పడాలి ? యీ విషయం ఎవరితోనన్నా అంటే ''ఆడపిల్లలుంటే నీకే తెలుస్తుంది. పెళ్ళి చెయ్యడం ఎంత కష్టమో ! '' అంటారు. కాని యిందు వల్లనేకదా పెద్దవాళ్ళకి ఈ కట్నాల మీద ఆశ లావయింది ? ఆ వయస్సులో నేనేం చెయ్యగలను ?... ఈ కారణాలన్నిట్టి వల్లా నేను కట్నం తీసుకొనక తప్పింది కాదు ! ఏమంటావు ? ... చెప్పు ! ఎవరిది తప్పో? నాదా ? ... పెద్ద వాళ్ళదా ?'' అందరూ తెలిసే యీ తప్పు చేస్తూంటే కట్నాలు పోవాలన్నా ఎలా పోతాయి?'' అని ముగించాడు. అది విన్న నాకు శేఖరం చెప్పింది కూడా సబబుగానే వుందనిపించింది.

★ ★ ★

*(ఆంధ్ర పత్రిక, 13.7.1955.)*